

కేరళ సీఎం పినరయి విజయన్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి, ఎంపీ

పునర్విభజనపై ఏం చేద్దాం?

- నేడు చెన్నైలో 7 రాష్ట్రాల నేతల భేటీ
- భవిష్యత్తు కార్యాచరణపై సమష్టి నిర్ణయం



తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుందగై, ఎంపీ రాజా తదితరులు

చెన్నై, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వచ్చే యేడాది ఆయా రాష్ట్రాల జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టనుండడంతో, దాని వల్ల తీవ్రంగా నష్టపోయే ఏడు రాష్ట్రాల రాజకీయ పార్టీల నేతలు శనివారం చెన్నైలో భేటీ కానున్నారు. పునర్విభజనను ఎలా ఎదుర్కోవాలి, భవిష్యత్‌లో ఎలా వ్యవహరించాలన్నదానిపై చర్చించనున్నారు. డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆహ్వానం పలువురు నేతలు ఇప్పటికే చెన్నై చేరుకున్నారు. గిండిలోని ఐటీసీ గ్రాండ్ చోళా హోటల్‌లో శనివారం ఉదయం 10 గంటలకు జరుగనున్న ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, ఒడిశా, పశ్చిమబెంగాల్, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ రాజకీయ పార్టీల ప్రతినిధులు, పలువురు సీఎంలు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో అందరి అభిప్రాయాలను ఏకీకరించి, పునర్విభజనపై భవిష్యత్ కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేయనున్నారు.

రాష్ట్ర హక్కుల పరిరక్షణ, ప్రాతినిథ్యం కోసమే: స్టాలిన్

సమావేశం జరగడానికి ఒక్కరోజు ముందు, శుక్రవారం స్టాలిన్ ఓ వీడియో సందేశం వెలువరించారు. ఆ సందేశంలో 'డి-లిమిటేషన్' అనే పదం దేశంలోని అందరి నోళ్లలోనూ నానుతోందన్నారు. 2026లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తప్పకుండా లోక్‌సభ నియోజవర్గాల పునర్విభజన చేసి తీరుతుందని, అదే జరిగితే రాష్ట్రానికి చెందిన ఎంపీల ప్రాధాన్యత తగ్గిపోతుందని, అందుకే డీఎంకే ఈ అంశాన్ని లేవదీస్తోందన్నారు. జనాభా ప్రాతిపదికన ఈ తంతు జరుగనుండటంతో ఇప్పటికే జనాభా నియంత్రణ సమర్థవంతంగా అమలు చేసినందుకు కేంద్రం విధించే శిక్షగా నియోజకవర్గాల సంఖ్య తగ్గిపోతుందన్నారు. వీటన్నింటినీ పరిశీలించిన మీదటే తాము అందరికంటే ముందుగా డీ-లిమిటేషన్‌కు వ్యతిరేకంగా పిలుపునిచ్చినట్లు తెలిపారు. డి-లిమిటేషన్‌ను ఎంపీల సంఖ్యకు సంబంధించిన అంశంగా చూడకూడదని, రాష్ట్ర హక్కులకు సంబంధించిన ప్రధానమైన అంశంగా చూడాలన్నారు. అందుకే బీజేపీ మినహా అన్ని పార్టీలతో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి పునర్విభజనకు వ్యతిరేకంగా దక్షిణాది రాష్ట్రాలను కలుపుకుని ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేసి సమైక్యంగా ఉద్యమిస్తే బాగుంటుందని, ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి కార్యాచరణ రూపమే శనివారం జరుగనున్న ఏడు రాష్ట్రాల ప్రతినిధుల సమావేశమని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ సమావేశానికి రావాలని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఒడిశా, పశ్చిమబెంగాల్, పంజాబ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు, పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం ఉన్న ఆయా రాష్ట్రాలకు చెందిన అన్ని పార్టీల నాయకులకు తాను లేఖలు కూడా రాసినట్లు తెలిపారు. డీ లిమిటేషన్ వల్ల నష్టపోనున్న దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులకు తాను ఫోన్ చేసి మాట్లాడినట్లు కూడా చెప్పారు. ఇది తొలివిడత సమావేశం మాత్రమేనని, పునర్విభజనవల్ల రాష్ట్రంతోపాటు, దక్షిణాది రాష్ట్రాలూ కూడా నష్టపోతే దేశంలో ప్రజాస్వామ్యం అంతరించిపోవటం ఖాయమన్నారు.శనివారం జరుగనున్న ఏడు రాష్ట్రాల ప్రతినిధుల సమావేశంలో తీసుకునే నిర్ణయం నియోజకవర్గాల పునర్విభజనపై భవిష్యత్ ఆందోళనను రూపొందిస్తుందన్నారు.



'ఫేర్ డీ లిమిటేషన్' అంటూ స్టాలిన్ చిత్రంతో మెరీనాలో ఏర్పాటు చేసిన సైకతశిల్పం

పలువురు సీఎంల రాక

ఈ సమావేశంలో పాల్గొనేందుకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ శుక్రవారం ఉదయమే నగరానికి చేరుకున్నారు. రాష్ట్ర మంత్రి పీటీఆర్ పళనివేల్‌రాజన్, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్ విమానాశ్రయం వద్ద ఆయన స్వాగతం పలికారు. కేరళకు చెందిన కమ్యూనిస్టు సీనియర్ నేత బినోయ్ విశ్వం, పంజాబ్ రాష్ట్రం శిరోమణి అకాలీదళం సీనియర్ నేత తల్‌జీత్‌సింగ్ సీమా, బలవీందర్ సింగ్ బందర్ శుక్రవారం ఉదయం వచ్చారు. అదేవిధంగా తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం రాత్రి 7.45 గంటలకు చెన్నై రాగా, విమానాశ్రయంలో ఆయనకు రాష్ట్ర మంత్రి కేఎన్ నెహ్రూ, ఎంపీ ఎ.రాజా స్వాగతం పలికారు. అదే విధంగా పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్, ఆమ్ ఆద్మీనేత సంజయ్ సింగ్ శుక్రవారం సాయంత్రం నగరానికి చేరుకున్నారు. కర్ణాటక ప్రభుత్వం తరఫున ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శివకుమార్ రానున్నారనే వార్తలు వస్తున్నప్పటికీ ఏఐసీసీ అనుమతివ్వడంతో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఈ సమావేశానికి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి జేఎస్పీ నాయకుడు ఉదయ్ శ్రీనివాసన్, కేరళ కాంగ్రెస్ సీనియర్ నేత జోస్ కె.మణి, కేరళకు చెందిన ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ నేత పీఎంఏ సలామ్ తదితరులు శుక్రవారం రాత్రి నగరానికి చేరుకున్నారు. ఒడిశాకు చెందిన బిజూ జనతాదళ్ నేతలు సంజయ్‌కుమార్, దాస్‌వర్మ తదితరులు రానున్నారు. చెన్నై విమానాశ్రయంలో సీపీఐ నేత బినోయ్ విశ్వం, పంజాబ్ శిరోమణి అకాలిదళ్ నేత బల్వీందర్‌సింగ్ మాట్లాడుతూ.. ఎంపీల పునర్విభజన వ్యవహారంలో స్టాలిన్ చొరవను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఇదిలా వుండగా వివిధ రాష్ట్రాల నుంచి ముఖ్య నేతలు తరలి రావడంతో గిండి నుంచి మీనంబాక్కం, పరిసర ప్రాంతాల్లో పోలీసులు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

రెండేళ్ళలో 20 లక్షల ల్యాప్‌టాప్‌లు

- అసెంబ్లీలో మంత్రి తంగం తెన్నరసు



ప్యారీస్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌లో ప్రకటించిన మేరకు రెండేళ్ళలో 20 లక్షల లాప్‌టాప్‌లను విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు అసెంబ్లీలో మంత్రి తంగం తెన్నరసు వెల్లడించారు. అసెంబ్లీ సమావేశం హాలులో తన శాఖకు సంబంధించిన అంశాలపై శుక్రవారం మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల ప్రజలు లబ్ధిపొందేలా వార్షిక బడ్జెట్ వుందన్నారు. ముఖ్యంగా గిరిజనులు ఆర్థికంగా, హక్కుల పరంగా అభివృద్ధిచేందేలా బడ్జెట్ రూపొందించినట్లు వివరించారు. రాష్ట్రంలో రైల్వే పనుల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం ఈ మూడేళ్ళలో రూ.19.68 కోట్లు విడుదల చేసిందని, అయితే బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఇంతకంటే ఎక్కువగా నిధులను కేటాయిస్తుందని మంత్రి వ్యాఖ్యానించారు. కోయంబత్తూరు జిల్లాలో కోవై, పల్లడం ప్రాంతాల్లో రెండు సెమీ కండక్టర్ల ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సిప్కాట్ ద్వారా 32 ఐటీ పార్కులను రూపొందించామని, మరోవైపు సమాచార సంకేతిక పార్కులను అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2021 అసెంబ్లీ ఎన్నికల డీఎంకే మేనిఫెస్టోలో ప్రకటించిన అల్పాహార పథకం విజయవంతంగా కొనసాగుతోందని, ఇక గృహిణుల కోసం ప్రవేశపెట్టిన నెలకు రూ.1,000 పథకంలో 1.15 మంది లబ్ధిపొందేలా చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. క్రీడాశాఖకు సంవత్సరానికి రూ.300 కోట్లను మంజూరు చేస్తున్నట్లు సభలో ఆయన తెలిపారు. రాబోయే రెండేళ్ళలో విద్యార్థిని, విద్యార్థులకు రూ.10వేల విలువైన 20 లక్షల లాప్‌టాప్‌లను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించి, తొలివిడత నిధులను కూడా కేటాయించిందని తెలిపారు.



డ్రైవర్ రహిత మెట్రోరైల్ ట్రయల్‌రన్ విజయవంతం

ప్యారీస్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూందమల్లి నుంచి ముల్లైతోట్టం మధ్య మూడు కిలోమీటర్ల దూరం మేర డ్రైవర్ రహిత మెట్రోరైల్ ట్రయల్‌రన్ విజయవంతమైందని చెన్నై మెట్రోరైల్వే లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్) సంస్థ అధికారులు ప్రకటించారు. నగరంలో రెండో దశ మెట్రోరైల్ పథకం 116 కిలోమీటర్ల మేర మూడు మార్గాల్లో అమలవుతోంది. లైట్‌హౌస్-పూందమల్లి హైరోడ్డు మధ్య నిర్మిస్తున్న మార్గంలో లైట్‌హౌస్ నుండి కోడంబాక్కం ఫ్లైఓవర్ వరకు సొరంగ మార్గం, కోడంబాక్కం పవర్‌హౌస్ నుండి పూందమల్లి హైరోడ్డు వరకు స్తంభాలపై రైలు మార్గం ఏర్పాటవుతోంది. ఇందులో పూందమల్లి-పోరూర్ మధ్య పలు ప్రాంతాల్లో పనులు తుదిదశకు చేరుకున్నాయి. డిసెంబరులో ఈ మార్గంలో మెట్రోరైల్ సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ మార్గంలో ఒక భాగంగా పూందమల్లి-ముల్లైతోట్టం మధ్య గురువారం సాయంత్రం 4గంటలకు నిర్వహించిన డ్రైవర్ రహిత మెట్రోరైల్ ట్రైల్ రన్ సంతృప్తికరంగా వుందని సీఎంఆర్‌ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సిద్ధిక్ తెలిపారు.

39 డ్రైవర్ రహిత రైళ్ల తయారు...

39 డ్రైవర్ రహిత రైళ్ల తయారీ కోసం అల్‌స్టోమ్ సంస్థకు సీఎంఆర్‌ఎల్ కాంట్రాక్ట్ అప్పగించింది. నగరంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత ప్రారంభించిన మెట్రోరైలు పథకానికి ప్రజల నుండి మంచి స్పందన వచ్చింది. తొలిదశ పథకంలో మీనంబాక్కం విమానాశ్రయం-అన్నాసాలై-సెంట్రల్ రైల్వేస్టేషన్-ఉత్తరచెన్నైలోని వింకోనగర్ మధ్య మెట్రోరైలు సేవలు కొనసాగుతున్నాయి. మరో మార్గంలో చెన్నైసెంట్రల్-పూందమల్లి హైరోడ్డు-కోయంబేడు- సెయింట్ థామస్ మౌంట్ల మధ్య ఈ సేవలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండో దశకోసం మూడు రూట్లలో కొత్తమెట్రో మార్గాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పథకంలో డ్రైవర్ రహిత రైళ్లను నడిపేందుకు సీఎంఆర్‌ఎల్ నిర్ణయించింది. ఇందుకోసం అల్‌స్టోమ్ (ఏటీఐఎల్) సంస్థకు 36రైళ్ల తయారు చేసేందుకు కాంట్రాక్ట్ అప్పగించింది. మూడు భోగిల రైలులో మొత్తం 900మంది ప్రయాణించేలా వసతులు సమకూర్చుతున్నట్లు మెట్రోరైలు అధికారులు తెలిపారు.

మీ పార్టీని తన్నుకుపోతారు

- అన్నాడీఎంకేపై మంత్రి తంగం తెన్నరసు వ్యంగ్యాస్త్రం
- మొసలి కన్నీరు కార్చొద్దు : ఈపీఎస్ చురకలు
- మోసపోకుండా ఉంటే చాలు : ఈపీఎస్‌కు స్టాలిన్ సలహా
- బీజేపీ పొత్తు ఒత్తిళ్లపై అసెంబ్లీలో రసవత్తర చర్చ

చెన్నై, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రకరకాల ఒత్తిడితో అన్నాడీఎంకేను తమ కూటమిలో చేర్చుకునేందుకు బీజేపీ తెరవెనుక ప్రయత్నాలు చేస్తోందంటూ ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు చేసిన పరోక్ష వ్యాఖ్యలకు ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ఘాటుగా సమాధానమిచ్చారు. పార్టీ పగ్గాలు తమ చేతుల్లోనే వున్నాయని, తమపై మొసలి కన్నీరు కార్చొద్దంటూ కౌంటర్ ఇచ్చారు. వీరిద్దరి వాగ్వివాదం జరుగుతుండగానే మాజీ మంత్రి తంగమణి మాట్లాడుతూ.. కూడికలు తీసివేతలు తమకు బాగా తెలుసని, పార్టీపరమైన లెక్కలు తేల్చే విషయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తామని వ్యాఖ్యానించారు. అందుకు సీఎం స్టాలిన్ స్పందిస్తూ ఈ విషయంలో (బీజేపీ విషయంలో) అన్నాడీఎంకే మోసపోకుండా ఉంటే చాలంటూ సభలో నవ్వులు పూయించారు. శుక్రవారం ఉదయం శాసనసభలో బీజేపీతో పొత్తు వ్యవహారంలో రసవత్తరమైన చర్చ జరిగింది. అంతకు ముందు ప్రశ్నోత్తరాల సమయంలో ఆర్థికమంత్రి తంగం తెన్నరసు మాట్లాడుతూ.. అన్నాడీఎంకేని ఎవరో అపహరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఈ విషయంలో చాలా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అన్నాడీఎంకే పార్టీ భవిష్యత్‌ను అజ్ఞాతవ్యక్తులు తీర్మానిస్తున్నారని, పార్టీని తన్నుకుపోయేందుకు ప్రయత్నిస్తున్నవారిపట్ల అన్నాడీఎంకే నేతలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాసనసభలో బీజేపీ శాసనసభ్యురాలు వానతి శ్రీనివాసన్ చాలా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని, ఎట్టకేలకు పిల్లి బయటకు వచ్చేసిందంటూ మంత్రి తంగం తెన్నరసు అనగానే అన్నాడీఎంకే శాసనసభ్యులంతా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.



తంగం తెన్నరసు, తంగమణి, స్టాలిన్

మీది మొసలి కన్నీరు : ఈపీఎస్

అన్నాడీఎంకేని తెరవెనుక ఎవరో నడిపిస్తున్నారంటూ అసెంబ్లీలో ఆర్థికమంత్రి తంగం తెన్నరసు అనడం విడ్డూరంగా ఉందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి అన్నారు. అసెంబ్లీ బయట మీడియాతో మాట్లాడుతూ.. డీఎంకే మంత్రులు అన్నాడీఎంకేపై జాలి చూపాల్సిన పనిలేదన్నారు. తమ పార్టీ ఆత్మగౌరవాన్ని విడిచిపెట్టదని, పార్టీ ఎప్పటికీ తమ ఆధీనంలోనే ఉంటుందని ఈపీఎస్ స్పష్టం చేశారు.

మోసపోకుండా ఉంటే చాలు: సీఎం స్టాలిన్

అసెంబ్లీలో బడ్జెట్ ప్రతిపాదనలపై జరిగిన చర్చలో పాల్గొన్న మాజీ మంత్రి తంగమణి మాట్లాడుతూ... బడ్జెట్ నిధుల కేటాయింపుపై అనుమానం వ్యక్తం చేసినప్పుడు ముఖ్యమంత్రి ఈ లెక్కలకన్నా పార్టీకి సంబంధించిన లెక్కల్లో (పొత్తులు, సీట్ల కేటాయింపులలో) అప్రమత్తంగా ఉండాలని చెప్పటం గర్హనీయమన్నారు. వెంటనే ముఖ్యమంత్రి స్టాలిన్ జోక్యం చేసుకుంటూ పార్టీ అంచనాలు,లెక్కలకు సంబంధించి మీరు(అన్నాడీఎంకే)మోసపోకుండా ఉంటే హార్దికాభినందనలు తెలియజేస్తామనటంతో డీఎంకే సభ్యులంతా హర్షం వ్యక్తం చేశారు.



కార్పొరేషన్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ ప్రియ

ఒక్కో వార్డు నిర్వహణకు రూ.10 లక్షలు

- కార్పొరేషన్ కౌన్సిల్‌లో ప్రకటన

అడయార్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగర పాలక సంస్థలోని వార్డు నిర్వహణ కోసం ఒక్కో కార్పొరేటర్‌కు రూ.10 లక్షలు కేటాయించనున్నారు. 2025-26 సంవత్సర వార్షిక బడ్జెట్‌పై శుక్రవారం కార్పొరేషన్ సమావేశంలో చర్చ జరిగింది. మేయర్ ఆర్.ప్రియ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఉప మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ కుమరగురుభరన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్పొరేషన్ బడ్జెట్‌లోని పలు ముఖ్యాంశాలను వివిధ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్లు, కార్పొరేటర్లు అభినందించారు. ఈ సందర్భంగా స్టాండింగ్ కమిటి ఛైర్మన్ నొలంబూరు రాజన్ మాట్లాడుతూ.. మేయర్ నిధి కోటి రూపాయల మేరకు పెంచామని, ఒక్కో కార్పొరేటర్‌కు రూ.10 లక్షలకు పెంచామన్నారు. స్టాండింగ్ కమిటీ ఛైర్మన్లకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తే వార్డు సభ్యుల అత్యవసర ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. దీనిపై డిప్యూటీ మేయర్ మహేశ్ కుమార్ మాట్లాడుతూ వార్డు నిర్వహణ ఖర్చుల కోసం ఇప్పటివరకు నిధులు కేటాయించలేదని, ఆ నిధులను కేటాయిస్తే మంచిదన్నారు, ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వార్డు నిర్వహణ ఖర్చుల కింద రూ.10 లక్షల నిధులను కేటాయిస్తామన్నారు అలాగే, బీజేపీ కార్పొరేటర్ ఉమా ఆనంద్ మాట్లాడుతూ, వార్డు అభివృద్ధి నిధులకు జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలని కోరారు.

రౌడీషీటర్‌పై గ్రేటర్ చెన్నై పోలీసుల కాల్పులు

ప్యారీస్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండీలో శుక్రవారం తెల్లవారుజామున పేరుమోసిన రౌడీ షీటర్ మహారాజాపై గ్రేటర్ చెన్నై పోలీసులు కాల్పులు జరిపిన సంఘటన రౌడీల్లో కలవరం పుట్టించింది వివరాల్లోకి వెళ్తే, తూత్తుకుడి జిల్లాకు చెందిన పేరుమోసిన రౌడీషీటర్ మహారాజాపై తిరునల్వేలి, తూత్తుకుడి తదితర జిల్లాలో హత్యాయత్నం, దౌర్జన్యం కేసులున్నాయి. అతను వారం రోజుల క్రితం తూత్తుకుడి నుండి నగరానికి వచ్చిన ఓ ముఠా ఆరంబాక్కంకు చెందిన నగల దుకాణం యజమానిని కిడ్నాప్ చేసి హతమార్చేందుకు రూపొందించిన పథకాన్ని పసిగట్టిన పోలీసులు భగ్నంచేసి, ఐదుగురిని అరెస్టు చేశారు. విచారణలో ఈ వ్యవహారంలో రౌడీషీటర్ మహారాజా కీలక పాత్ర పోషించారని తెలిసింది. దీంతో తిరునల్వేలి వెళ్ళిన ప్రత్యేక పోలీసు బృందం అక్కడి పోలీసుల సహకారంతో మహారాజాను అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం నగరానికి తీసుకొచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున 4.30గంటల ప్రాంతంలో గిండీకి చేరుకున్న సమయంలో పోలీసుల కస్టడీ నుంచి తప్పించుకునేందుకు యత్నించిన మహారాజా రాళ్లతో దాడిచేయగా ఆత్మరక్షణ కోసం పోలీసులు కాల్పులు జరపడంతో రౌడీకి గాయాలయ్యాయి. అతడిని ముందుగా సైదాపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం రాయపేట ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఇదిలా వుండగా, స్కాట్లాండ్ పోలీసులకు ధీటుగా సంఘ విద్రోహాల ఆగడాలకు చెక్ పెడుతున్న రాష్ట్రపోలీసులు గడిచిన 48గంటల్లో ఎడుగురిపై కాల్పులు జరిపి అదుపులోకి తీసుకోవడం గమనార్హం.



గిండీలో కాల్పులు జరిపిన ప్రాంతం - ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రౌడీషీటర్ మహారాజా

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:26 (శనివారం సాయంత్రం)
సహర్: 4:31 (ఆదివారం ఉదయం)

సమాచార ధ్వని

రేపు 'సైకిల్ పోలో' పోటీలు

పెరంబూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చెన్నై జిల్లా సైకిల్ పోలో సంఘం ఆధ్వర్యంలో 'సైకిల్ పోలో' ఛాంపియన్ షిప్ పోటీలు ఆదివారం విరుగంబాక్కంలోని ఆవిచ్చి పాఠశాల మైదానంలో జరుగనున్నాయి. ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న ఈ పోటీలను 13,15,17,19, ఆపైన సీనియర్లకు వేర్వేరు విభాగాల్లో నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన చెన్నై నగరానికి చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పోటీలు జరిగే ప్రాంతానికి నేరుగా వచ్చి పాల్గొనవచ్చని చెన్నై జిల్లా సైకిల్ పోలో సంఘం ఒక ప్రకటనలో తెలిపింది.

రేపు జాక్టో-జియో నిరాహారదీక్ష

పెరంబూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక చేపాక్కంలోని ఎళిలగం ప్రాంగణంలో ఆదివారం ప్రభుత్వ ఉద్యోగులు-ఉపాధ్యాయుల సంఘం (జాక్టో-జియో) ఆధ్వర్యంలో నిరాహారదీక్ష చేపట్టనున్నారు. ఈ మేరకు ఆ సంఘం విడుదల చేసిన ప్రకటనలో... పాత పింఛన్ విధానం అమలు, ఖాళీ పోస్టుల భర్తీ సహా పలు డిమాండ్లతో పలు రూపాల్లో ఆందోళనలు చేపట్టామన్నారు. డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టకపోవడాన్ని నిరసిస్తూ వచ్చే సోమవారం నగరంలో నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించారు.

26 నుంచి బేకరీ పదార్థాల తయారీపై శిక్షణ

పెరంబూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 28వ తేది వరకు బేకరీ ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు. బేకరీ పదార్థాల తయారీకి అవసరమైన ముడిసరుకులు, యంత్రాలు, ఇతర పరికరాలు వివరించానున్నారు. ఈ శిక్షణలో హైదరాబాద్ కరాచీ బిస్కెట్, జొర్రా ఉప్పు బిస్కెట్, తీపి రొట్టెలు, క్రీమ్ బన్, పఫ్స్, కేక్ తదితరాల తయారీపై శిక్షణ అందించనున్నారు. ఆసక్తి కలిగిన వారు http://www.edin.in అనే వెబ్‌సైట్‌లో పేరు నమోదుచేసుకోవచ్చు. అలాగే, శిక్షణా తరగతులు జరిగే ఈ కాట్టు తాంగళ్‌లోని సంస్థ కార్యాలయాన్ని, 8668108141, 8668102600 అనే నెంబర్లు సంప్రదించవచ్చని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

షాలిమార్ ఎక్స్‌ప్రెస్ రైలుకు రెండు జనరల్ బోగీలు

పెరంబూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): షాలిమార్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలుకు రెండు జనరల్ బోగీలు అనుసంధానం చేయనున్నారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... నెం.22825/22826 షాలిమార్- చెన్నై సెంట్రల్-షాలిమార్ సూపర్ ఫాస్ట్ రైలుకు ఏప్రిల్ 15వ తేది నుంచి రెండు జనరల్ బోగీలు అనుసంధానం చేయనున్నారు. దానికి బదులుగా ఒక ఏసీ టూ టైర్, ఏసీ త్రీ టైర్ బోగీలు తొలగిస్తున్నట్లు దక్షిణ రైల్వే తెలియజేసింది.

29న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం

పెరంబూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆదిద్రావిడ, గిరిజనుల మానిటరింగ్ కమిటీ సమావేశం ఈ నెల 29వ తేది జరుగనుంది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ విడుదల చేసిన ప్రకటనలో... ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షుడిగా ఉన్న ఈ కమిటీలో ఆర్థిక శాఖ మంత్రి తంగం తెన్నరసు, ఉన్నత విద్యశాఖ మంత్రి కేవీ చెళియన్, కార్మికుల సంక్షేమం-వృత్తి నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి సీవీ గణేశన్, ఆదిద్రావిడ సంక్షేమ శాఖ మంత్రి ఎం.మదివేందన్, మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి కయల్‌విళి సెల్వరాజ్ తదితరులు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ సమావేశం ఈ నెల 29వ తేది ఉదయం 10.30 గంటలకు స్థానిక సచివాలయంలోని నామక్కల్ కవీంజర్ మాళిగైలోని 10వ అంతస్తులో జరుగుతుందని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

నేటినుంచి చెన్నై-తిరుచ్చి విమాన సేవలు

పెరంబూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి తిరుచ్చికి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ శనివారం నుంచి విమాన సేవలు ప్రారంభించనుంది. ప్రస్తుతం ఇండిగో ఎయిర్‌లైన్స్ మాత్రమే చెన్నై-తిరుచ్చి మధ్య విమానాలు నడుపుతోంది. ఈ విమానాల్లో ప్రయాణికుల సంఖ్య పెరగడంతో ఛార్జీ అధికంగా వసూలుచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ శనివారం నుంచి చెన్నై-తిరుచ్చి మధ్య రోజువారీ విమాన సేవలు పరిచయం చేసింది. ఆ ప్రకారం, చెన్నై నుండి సాయంత్రం 6.45 గంటలకు బయల్దేరే విమానం రాత్రి 7.45 గంటలకు తిరుచ్చి చేరుకుంటుంది. మరుమార్గంలో తిరుచ్చి నుంచి రాత్రి 8.15గంటలకు బయల్దేరి 9.15గంటలకు చెన్నై చేరుకుంటుందని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

పాము, కుక్క కాటుకు సరిపడా మందులు

పెరంబూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వాపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పాము, కుక్క కాటు బాధితులకు అవసరమైన మందులున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే సెల్వపెరుందగై మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా పిచ్చికుక్కలు, వీధి కుక్కల దాడిలో పలువురు గాయపడుతున్నారని, బాధితులకు అవసరమైన మందులుండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు మంత్రి సుబ్రమణ్యం సమాధానమిస్తూ... రాష్ట్రవ్యాప్తంగా 2,686 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పాము, కుక్క కాటు బాధితులకు అందించే మందులు తగినంతగా నిల్వలున్నాయని తెలిపారు.

వేడుకగా కార్పొరేషన్ పాఠశాల వార్షికోత్సవం

వేలూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్తువాచ్చేరిలోని కార్పొరేషన్ మాధ్యమిక పాఠశాల 42 వార్షికోత్సవం శుక్రవారం వేడుకగా సాగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సింగరాయర్, వీఎం బాలకృష్ణన్, ఏలుమలై, కౌన్సిలర్ మాలతి, మాజీ బీడీఓ సుందరం తదితరులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన పలు క్రీడా పోటీల విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

పంజాబ్ అన్నదాతలకు మద్దతుగా రైల్ రోకో

● అయ్యాకన్ను సహా 50 మంది రైతుల అరెస్టు


తిరుచ్చిలో వైగై ఎక్స్‌ప్రెస్ ఆపి ఆందోళన చేస్తున్న అయ్యాకన్ను, రైతులు

చెన్నై, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పంజాబ్‌లో తమ ఉత్పత్తులకు మద్దతు ధర సహా పలు డిమాండ్ల సాధనకోసం 120 రోజులుగా ఆందోళన జరుపుతున్న ఆ రాష్ట్ర రైతులకు మద్దతుగా తిరుచ్చిలో దక్షిణ భారత రైతు సంఘాల సమాఖ్య నాయకుడు అయ్యాకన్ను నాయకత్వంలో స్థానిక రైతులు రైలు రోకో నిర్వహించారు. తిరుచ్చి చింతామణి సమీపంలోని కావేరి నది వంతెనపై రైతులంతా నిలిచి ఆ మార్గంలో మదురై నుంచి చెన్నై వెళుతున్న వైగై ఎక్స్‌ప్రెస్‌ను ఆపేశారు. జెండాలు పట్టుకుని పంజాబ్ రైతులకు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ ఆందోళన గురించి తెలుసుకున్న రైల్వే పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్లి అయ్యాకన్ను, రైతు సంఘాల సమాఖ్య నేత మోహరాజన్ సహా 50 మందికిపైగా రైతులను అరెస్టు చేశారు.

త్వరలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ

● మంత్రి చక్రపాణి

పెరంబూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డులు త్వరలో అందజేయనున్నట్లు ఆహార శాఖ మంత్రి చక్రపాణి తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఓ సభ్యుడు... కొత్త రేషన్ కార్డులిచ్చే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందా? అంటూ ప్రశ్నించారు. దానికి మంత్రి సమాధానమిస్తూ... డీఎంకే ప్రభుత్వ హయాంలో 18,09,607 కొత్త రేషన్ కార్డులు ఇచ్చామన్నారు. కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన 51,328 మందికి ఇచ్చేందుకు రేషన్‌కార్డులు ముద్రిస్తున్నామని, మరో 1,67,796 వినతిపత్రాలు పరిశీలనలో ఉన్నాయని, వాటిని కూడా త్వరలో అందజేస్తామని తెలిపారు. ఆ ప్రకారం రాష్ట్రంలో 2.29 కోట్ల రేషన్ కార్డులున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని 37,299 రేషన్ దుకాణాల్లో ప్రజలు ఫిర్యాదు చేసేలా ఫిర్యాదు పెట్టెలు ఏర్పాటుచేశామని మంత్రి తెలిపారు.

కోవైలో 'మెట్రో'...

అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన


సర్వే చేస్తున్న అధికారులు

పెరంబూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ అవినాశి రోడ్డు, శక్తి రోడ్డులో మెట్రోరైళ్లు నడిపేందుకు మార్గాలు ఖరారుచేసి కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక పంపించారు. చెన్నై మెట్రోరైలు కార్పొరేషన్ (సీఎంఆర్ఎల్) ఆమోదంతో, కార్పొరేషన్ స్వాధీనం చేసుకునేందుకు అవసరమైన స్థలాల సర్వే ప్రారంభమైంది. అలాగే, ఆయా ప్రాంతాల్లోని భూమిలో పల అంతర్లీన పరిస్థితులు తెలుసుకొనేలా ఉక్కడం బస్టాండ్ ప్రాంతంలో గురువారం పరిశీలించారు. రెండు మార్గాల్లో భూగర్భ డ్రైనేజీ, నీటి, గ్యాస్ పైపు లైన్లు, విద్యుత్ లైన్లు, టెలికమ్యూనికేషన్ వైర్లు తదితరాలు కూడా సర్వే చేస్తున్నారు. కార్పొరేషన్ నియమించిన ప్రైవేటు ఏజెన్సీలు సర్వే చేపట్టగా, మెట్రోరైలు డిప్యూటీ మేనేజర్ గోకుల్, అసిస్టెంట్ మేనేజర్ వినోద్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

మదురై ఎయిమ్స్ పనులు 26 శాతం పూర్తి

● కేంద్ర మంత్రి ప్రతాప్‌రావు జాదవ్

ప్యారీస్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మదురై సమీపంలోని తోపూర్‌లో కేంద్రప్రభుత్వం చేపట్టిన ఎయిమ్స్ ఆస్పత్రి నిర్మాణ పనులు 26 శాతం పూర్తయినట్లు కేంద్ర సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ పేర్కొన్నారు. తోపూర్‌లో 220 ఎకరాల్లో ఎయిమ్స్ నిర్మాణానికి 2019వ సంవత్సరంలో ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. తొలిదశ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో, శుక్రవారం లోక్‌సభలో ఎయిమ్స్ ఆస్పత్రి నిర్మాణం గురించి డీఎంకే ఎంపీ దయానిధి మారన్ ప్రశ్నించారు. ఇందుకు కేంద్రమంత్రి తన సమాధానంలో మదురై ఎయిమ్స్ 2026 అక్టోబరు నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా పనులను వేగవంతం చేసినట్లు తెలిపారు. జపాన్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు తొలిదశ నిర్మాణం పనులు 26శాతం పూర్తయ్యాయని, నిర్మాణంలో ఎలాంటి జాప్యంలేకుండా అవసరమైన నిధులను కూడా సమకూర్చుకున్నట్లు ఆయన తెలిపారు.

యువత సంక్షేమం కోసమే ఆన్‌లైన్ గేమ్‌ల కాలపరిమితి

● రాష్ట్ర ప్రభుత్వ వివరణ

పెరంబూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): యువత సంక్షేమం దృష్ట్యా ఆన్‌లైన్ గేమ్‌లకు కాలపరిమితి విధించినట్లు రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఆన్‌లైన్ గేమ్‌లతో నష్టపోయిన కారణంగా 2019 నుంచి 2024వ సంవత్సరం వరకు 47 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ కారణంగా, రాష్ట్రంలో ఆన్‌లైన్ గేమ్‌లు నియంత్రించేలా తమిళనాడు ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ నిషేధ చట్టం 2022 అమలుచేసింది. ఇందుకు సంబంధించి ఫిబ్రవరి 14న రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆన్‌లైన్ గేమింగ్ సంస్థలు మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశాయి. ఈ పిటిషన్ శుక్రవారం విచారణకు రాగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున... ఆన్‌లైన్ గేమ్‌లు నియంత్రించేందుకు కమిషన్ ఏర్పాటు చేశామని, వాటిని నిషేధించేందుకు కాదని వివరించారు. అలాగే, మానసికంగా, శాస్త్రీయ డేటా, అధ్యయనాల ఆధారంగా ఆంక్షలు విధించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది. ప్రభుత్వ వివరణ అనంతరం తదుపరి విచారణ ఈ నెల 27కు వాయిదా వేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

డీలిమిటేషన్‌పై డీఎంకే వైఖరికి నిరసనగా నేడు బీజేపీ నల్లజెండాల ప్రదర్శన

చెన్నై, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని ఇప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోయినా డీఎంకే ప్రభుత్వం ఈ విషయంలో అనవసరమైన ఆందోళన చేయడానికి నిరసనగా శనివారం ఉదయం నల్లజెండాల ప్రదర్శన చేయనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ డీఎంకే ప్రభుత్వ అసమర్థపాలనపై రాష్ట్ర ప్రజలంతా తీవ్ర అసంతృప్తితో ఆగ్రహంతో ఉన్నారని, వారి దృష్టిని మరల్చేందుకే ముఖ్యమంత్రి స్టాలిన్ నియోజకవర్గాల పునర్విభజన, జాతీయ విద్యా విధానం, నిర్బంధ హిందీ అంటూ ఏడు రాష్ట్రాలకు చెందిన రాజకీయ పార్టీ నేతలతో ఉమ్మడి కార్యాచరణ సమావేశం అంటూ కపటనాటకాలాడుతున్నారని తెలిపారు. ఇక ఈ సమావేశానికి హాజరయ్యే కర్ణాటక ఉప ముఖ్యమంత్రి శివకుమార్ మెకెదాటుపై వంతెన నిర్మించితీరుతామంటూ శపథం చేశారని, అలాంటి నేతను సమావేశానికి ఆహ్వానించడం భావ్యమేనా అని ప్రశ్నించారు. కేరళ ప్రభుత్వం కూడా రాష్ట్రానికి గత నాలుగేళ్లుగా తీరని అన్యాయాలే చేసిందన్నారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ ఆధ్వర్యంలో శనివారం పార్టీ నాయకులు వారి వారిళ్ళ వద్దే నల్ల జెండాలు పట్టుకుని నిరసన ప్రదర్శనలు జరపాలని అన్నామలై విజ్ఞప్తి చేశారు.

సంతకాల ఉద్యమానికి అపూర్వ స్పందన...

రాష్ట్రమంతటా త్రిభాషా విద్యావిధానానికి మద్దతుగా సేకరిస్తున్న సంతకాల సేకరణ ఉద్యమానికి అపూర్వమైన స్పందన లభించినట్లు అన్నామలై పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన జారీ చేస్తూ ఈ నెల ప్రారంభించిన సంతకాల సేకరణకు విద్యావంతులు గట్టి మద్దతు పలుకుతున్నారని తెలిపారు. గత 13 రోజుల్లో 13 లక్షల మంది సంతకాలు చేశారని ఆయన వివరించారు.

భూసేకరణకు వ్యతిరేకంగా ఆందోళన

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సహా కార్యకర్తల అరెస్ట్


రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న షణ్ముగం, కార్యకర్తలు

పెరంబూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కడలూరు సమీపంలో వ్యవసాయ భూములు స్వాధీనం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనచేసిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం సహా కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. కడలూరు జిల్లా పంచాయతీలోని మలైయడికుప్పం, బొత్తాన్‌కుప్పం, కొడుక్కంపాళ్యం సహా నాలుగు గ్రామాల్లో 160 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. ఈ భూములు స్వాధీనం చేసుకొని తోళ్ల పరిశ్రమకు అప్పగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీపిపి అన్నాడీఎంకే సహా పలు పార్టీలు వ్యతిరేకించాయి. ఈ నేపథ్యంలో, వ్యవసాయ భూములు స్వాధీనం చేసుకోవడాన్ని నిరసిస్తూ అఖిత భారత రైతు సంఘంతో కలసి సీపీఎం ఆందోళన చేపడుతోంది. ఆందోళనలో భాగంగా శుక్రవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం సహా వందలాది మంది కార్యకర్తలు ఆందోళనలో పాల్గొన్నారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య స్వల్ప వాగ్వివాదం, తోపులాట జరిగింది. దీంతో, అనుమతి లేకుండా ఆందోళన చేశారంటూ షణ్ముగం సహా కార్యకర్తలను పోలీసులు వాహనాల్లో ఎక్కించి సమీపంలో కల్యాణ మండపానికి తరలించారు. భూసేకరణ చర్యలు ప్రభుత్వం వాపసు తీసుకోని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని షణ్ముగం హెచ్చరించారు.

దివ్యాంగ విద్యార్థుల విహారయాత్ర


విద్యార్థులకు పలకరిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మానసిక శిక్షణ కేంద్రంలో ఉన్న దివ్యాంగ చిన్నారులను ఒకరోజు విహారయాత్రకు తీసుకెళ్లారు. జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి జెండా ఊపి యాత్ర ప్రారంభించారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి శరవణన్, కలెక్టర్ కార్యాలయ జనరల్ మేనేజర్ శరవణన్ సహా పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

టాస్మాక్ దుకాణాలకు సీఎం ఫొటోలు అంటించిన బీజేపీ శ్రేణులు


సీఎం స్టాలిన్ ఫోటో అంటించి నినాదాలు చేస్తున్న బీజేపీ శ్రేణులు

తిరుత్తణి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి మున్సిపాలిటీలో అరక్కోణం రోడ్డులోని చెరువు సమీపంలోవున్న టాస్మాక్ మద్యం దుకాణం వద్ద గురువారం సాయంత్రం టాస్మాక్ సంస్థలో జరిగిన అవినీతికి నిరసిస్తూ, ముఖ్యమంత్రి స్టాలిన్ ఫొటోలను బీజేపీ శ్రేణులు మద్యం షాపుల బయట అంటించారు.

కులగణన కోరుతూ పిటిషన్

● తోసిపుచ్చిన హైకోర్టు

పెరంబూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులగణన చేపట్టాలంటూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు మదురై బెంచ్ తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేసింది. రామనాథపురం జిల్లాకు చెందిన సతీష్ హైకోర్టు మదురై బెంచ్‌లో దాఖలుచేసిన ప్రజావ్యాజ్యంలో... విద్య, ఆర్థికాభివృద్ధి, ఉపాధి తదితరాల్లో సమాన అవకాశాలు, హక్కులు సాధించాలంటే కులగణన అవసరమన్నారు. రాష్ట్రంలో కులగణన చేపట్టి సుమారు 30 ఏళ్లు పూర్తయిందని, అందువల్ల పలు సామాజిక వర్గాలు ఆర్థికాభివృద్ధి సాధించలేకపోతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వమే కులగణన చేపట్టేలా ఆదేశించాలంటూ పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ శుక్రవారం న్యాయమూర్తులు నిషాభాను, శ్రీమలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఆ సమయంలో పిటిషనర్ తరఫున హాజరైన న్యాయవాది... పలు రాష్ట్రప్రభుత్వాలు తమ తమ రాష్ట్రాల్లో స్వయంగా కులగణన చేపట్టాయని, రాష్ట్రంలో కూడా రాష్ట్ర ప్రభుత్వమే కులగణన చేపట్టేడా ఉత్తర్వులు జారీచేయాలని వాదించారు. పిటిషనర్ తరఫు వాదన నిరాకరించిన ధర్మాసనం... కులాల వారీ గణన కేంద్ర ప్రభుత్వానికి సంబంధించినదని, అంతేకాకుండా, కులగణనకు సంబంధించి పలు కేసులు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని ఎలా ఆదేశించగలమని, పిటిషనర్ అభ్యర్థన అంగీకరించడం లేదన్న ధర్మాసనం, పిటిషన్ కొట్టివేస్తూ విచారణ ముగిసినట్లు ప్రకటించింది.

ఉత్సాహంగా చేపలు పట్టే వేడుక


చేపలు పట్టుకున్న ప్రజలు

పెరంబూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా సింగంపురి సమీపం సేవుకపెరుమాళ్ అయ్యనార్ ఆలయానికి చెందిన మక్కుండాన్ కోవిల్‌పట్టి గ్రామ చెరువులో శుక్రవారం చేపలు పట్టే వేడుకలు జరిగాయి. పంట కోతలు పూర్తయిన తర్వాత చేపలు పట్టే వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఉదయం జరిగిన వేడుకలకు మక్కుండాన్ కోవిల్‌పట్టి, సింగపురి సహా పలు గ్రామాలకు చెందిన పిల్లలు, మహిళలు, పురుషులు, వృద్ధులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 8 గంటలకు గ్రామ పెద్దలు జెండా ఊపడంతో చెరువులోకి దిగిన ప్రజలు సుమారు 7 కిలోల బరువున్న చేపలు కూడా పట్టుకొని సంతోషంగా ఇళ్లకు బయల్దేరి వెళ్లారు.

40 సవర్ల బంగారం చోరీ

వేలూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడిలో 40 సవర్ల నగలు, 500 గ్రాముల వెండి వస్తువులు దోపిడీ చేసిన అగంతకుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. మేట్టుకులమ్ ప్రాంతానికి చెందిన రాజ కుమార్తె వివాహ నిశ్చితార్థం త్వరలో జరుగనుంది. అందుకోసం కుటుంబ సభ్యులతో కలసి కొత్త దుస్తుల కొనుగోలుకు చెన్నై వెళ్లాడు. ఈ క్రమంలో, గురువారం రాత్రి ఇంటి తాళాలను గ్యాస్ కటింగ్ మెషీన్ ద్వారా కోసి లోనికి ప్రవేశించిన అగంతకులు, బీరువాలో ఉంచిన 40 సవర్ల బంగారం, 500 గ్రాముల వెండి వస్తువులు దోచుకొని పరారయ్యారు. శుక్రవారం ఇంటికి తిరిగొచ్చిన రాజా, తాళాలు బద్దలుకొట్టి ఉండడం, బీరువాలో బంగారం, వెండి చోరీకావడం గమనించి కాట్పాడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు, ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు.

షేర్ మార్కెట్లో నష్టం.. యువకుడి ఆత్మహత్య

పెరంబూర్,మార్చి21(ఆంధ్రజ్యోతి):షేర్‌మార్కెట్లో పెట్టుబడిపెట్టి నష్టపోయిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దురైపాక్కం ప్రాంతానికి చెందిన బాబు(32) రాజీవ్‌గాంధీరోడ్డులో స్టేషనరీ దుకాణం నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి అతను ఇంటికి వెళ్లలేదు. గురువారం మధ్యాహ్నం వరకు దుకాణం తెరవకపోవడంతో అనుమానించిన తల్లి, చుట్టుపక్కల వారి సాయంతో దుకాణం షట్టర్లు తెరవగా, లోపల బాబు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడడం గమనించి బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. కొద్ది కాలంగా షేర్ మార్కెట్లో పెట్టుబడి పెట్టిన బాబు భారీగా డబ్బు నష్టపోయినట్లు, ఆ కారణంగానే అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఏఎస్ఐ మృతి

తిరుత్తణి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని మురుగన్‌పట్టిలో బుధవారం ఉదయం వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న మహిళ ఏఎస్సై మెర్సీ (35) గురువారం సాయంత్రం మృతిచెందారు. మెర్సీ తిరువళ్లూరు జిల్లా పట్టాభిరామాపురం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తున్నారు. విధుల్లో పాల్గొనేందుకు బైక్‌పై వెళ్తున్న సమయంలో ఆమెను ఓ ట్రక్ ఢీకొనడంతో గాయపడిన విషయం తెలిసిందే. చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె గురువారం సాయంత్రం మృతిచెందింది. పోలీసులు ఏఎస్సై మృతి కేసు నమోదు చేసి, సంబంధిత ట్రక్ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

విద్యార్థి దారుణహత్య


లోకేష్ (ఫైల్‌ఫొటో)

తిరుత్తణి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు 19ఏళ్ళ ఓ విద్యార్థిపై కత్తులతో దాడి చేసి హతమార్చిన ఘటన తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే తిరువలంగాడులోని ఓ ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న తిరువళ్లూరు జిల్లా పూండి ప్రాంతానికి చెందిన శ్రీనివాసన్ కుమారుడు లోకేష్ (19) శుక్రవారం ఉదయం నత్తవాడ ప్రాంతంలో శవమై కనిపించాడు. సమాచారమందుకుని ఘటనా స్థలానికి చేరకున్న పోలీసులు గుర్తుతెలియని వ్యక్తులు లోకేష్‌పై కత్తులతో దాడిచేసి హతమార్చినట్లు గుర్తించారు. కళాశాల విద్యార్థులే గొడవల కారణంగా ఈ హత్యకు పాల్పడి వుంటారేమోనని పోలీసులు అనుమానం వ్యక్తంచేశారు. ఈ సంఘటన గురించి మృతుడి తండ్రికి విషయం తెలిపి విచారించగా, కుమారుడు గురువారం రాత్రి చిన్నమ్మపేటలోవున్న తన బంధువుల ఇంటికి వెళ్లాడని, అంతకు మించి తనకు ఏ విషయం తెలీదని తెలిపాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు లోకేష్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, దర్యాప్తు చేస్తున్నారు.

సీమాన్ వ్యాఖ్యలపై ఆధారాలు కోరిన మద్రాస్ హైకోర్టు

ప్యారీస్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): న్యాయశాఖను కించపరుస్తూ వ్యాఖ్యానించిన నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే) ఆర్గనైజర్ సీమాన్‌పై దాఖలైన కేసు ఆధారాలను సమర్పించాలని మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. గత ఏడాది నవంబరులో ఓ య్యూట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూలో పాల్గొన్న సీమాన్ న్యాయశాఖ గౌరవప్రతిష్ఠతను అగౌరవపరచేలా విమర్శలు చేశారు. సీమాన్‌పై మద్రాస్ హైకోర్టు న్యాయవాదుల తరుపున సీనియర్ న్యాయవాది ఛార్లెస్ రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ, ఎగ్మూర్ మేజిస్ట్రేట్ కోర్టులో దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ ఉత్తర్వులను మరోమారు పరిశీలించాలని కోరుతూ న్యాయవాది ఛార్లెస్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. శుక్రవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం న్యాయశాఖను కించపరచే విధంగా సీమాన్ వ్యాఖ్యానించినందుకు ఆయనపై నమోదు చేసిన కేసు వివరాలు, ఆధారాలు సమర్పించాల్సిందిగా ఉత్తర్వులు జారీచేసి, తదుపరి విచారణను వచ్చే నెల 16వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

14 మంది పాంబన్ జాలర్లకు తలా రూ.4.50 లక్షల జరిమానా

● శ్రీలంక న్యాయస్థానం తీర్పు

పెరంబూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పాంబన్ జాలర్లు 14 మందికి తలా రూ.4.50 లక్షల జరిమానా విధిస్తూ శ్రీలంక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. రామేశ్వరం సమీపం పాంబన్‌కు చెందిన జాలర్లు ఈ నెల 6వ తేది చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. ధనుష్కోటి-తలైమన్నార్ సరిహద్దుల్లో చేపలు పడుతున్న జాలర్లను చుట్టుముట్టిన లంక నావికాదళం, సరిహద్దులు దాటారంటూ 14 మంది జాలర్లను అరెస్ట్ చేసి జైలుకు తరలించింది. జాలర్లను శుక్రవారం మన్నార్ న్యాయస్థానంలో హాజరుపరచగా, వారికి తలా రూ.4.50 లక్షల జరిమానా విధించిన న్యాయస్థానం, జరిమానా చెల్లించని పక్షంలో ఆరు నెలలు జైలుశిక్ష గడపాలని ఆదేశించింది.

బస్సు నుంచి జారిపడి మహిళ మృతి

పెరంబూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మధురాంతకంలో బస్సు నుంచి జారిపడి మహిళ మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సెంపూండి గ్రామానికి చెందిన శివగామి, మామండూర్‌లోని ఓ హోటల్‌లో పనిచేస్తోంది. శివగామి యథావిధిగా శుక్రవారం ప్రభుత్వ బస్సులో మామండూర్ బయల్దేరింది. మామండూర్ బస్టాండ్ వద్దకు బస్సు వస్తుండగా, శివగామి బస్సు దిగేందుకు యత్నించి కిందపడిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆమెను చుట్టుపక్కల వారు చెంగల్పట్టు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పటాలం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

● ఈ-బైక్‌లో మంటలు...

చిన్నారి మృతి చెందిన 4 రోజుల్లో తండ్రి మరణం

పెరంబూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మధురవాయల్‌లో ఛార్జింగ్‌కు ఉంచిన ఈ-బైక్‌లో మంటలు చెలరేగిన ఘటనలో చికిత్స పొందుతున్న గౌతమ్ మృతిచెందాడు. మధురవాయల్ ఇందిరా గాంధీ ప్రాంతానికి చెందిన గౌతమ్ అదే ప్రాంతంలో భార్య, 9 నెలల చిన్నారితో నివసిస్తున్నాడు. ఘటన జరిగిన రోజున ఇంటి ప్రాంగణంలో ఛార్జింగ్‌కు ఉంచిన ఈ-బైక్‌లో మంటలు చెలరేగాయి. మంటలు ఆర్పేందుకు యత్నించిన గౌతమ్, బాలుడిని ఎత్తుకున్న భార్యకు కూడా తీవ్రగాయాలై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అక్కడ చికిత్సలు ఫలించక ఈ నెల 17న చిన్నారి మృతిచెందగా, శుక్రవారం గౌతమ్ కూడా మృతిచెందాడు. ప్రస్తుతం గౌతమ్ భార్య ప్రాణాపాయ స్థితిలో చికిత్సలు పొందుతోంది.

నటుడు విశాల్ చెల్లి భర్తపై సీబీఐ కేసు

చెన్నై, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలతో నగదు మోసానికి పాల్పడినందుకు నటుడు విశాల్ చెల్లి భర్త క్రితిష్‌తో పాటు ఆయన నడుపుతున్న ఉమ్మిడి బంగారు జ్యూవెలర్స్‌పై సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు. కోలీవుడ్ నటుడు విశాల్‌కు ఐశ్వర్య అనే సోదరి ఉన్నారు. ఆమెకు బంగారు దుకాణం వ్యాపారి ఉమ్మిడి క్రితిష్‌కు 2017లో వివాహం జరిగింది.ఈనేపథ్యంలో క్రితిష్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. అయ్యప్పన్ తాంగల్‌లోఉన్న ఓ బ్యాంకులో నకిలీ పత్రాలతో రూ.5.5 కోట్ల మేర రుణం తీసుకోవడంతో పాటు రూ.2.5 కోట్ల నగదు కూడా తీసుకుని మోసం చేసినట్లు తేలడంతో కేసు నమోదు చేశారు. అలాగే, ఒక స్థల యజమాని, భవన నిర్మాణ యజమాని, బ్యాంకు అధికారులతో సహా మొత్తం ఏడుగురిపై కేసు నమోదు చేశారు.


ఎద్దులు అదుపుచేస్తున్న క్రీడాకారులు

కోలాహలంగా జల్లికట్టు పోటీలు

పెరంబూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా విరాలిమలై సమీపం కీళకుర్చి కలంగాదకండ అయ్యనార్ ఆలయ వేడుకల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన జల్లికట్టు పోటీలు కోలాహలంగా సాగాయి. ఉదయం 9 గంటలకు ఈ పోటీలను మాజీ మంత్రి సి.విజయభాస్కర్, డీఎంకే నార్త్ జిల్లా కార్యదర్శి సెల్లపాండ్యన్, తహసీల్దార్ అక్బర్ అలీ జెండా ఊపి పోటీలు ప్రారంభించారు. తొలుత ఆలయ ఎద్దు వడివాసల్ నుంచి బయటకు రాగా, క్రీడాకారులు దానిని వదిలేశారు. అనంతరం తిరుచ్చి, పుదుకోట, మదురై, కరూర్, దిండుగల్, తేని సహా పలు జిల్లాల నుంచి సుమారు 600లకు పైగా ఎద్దులు విడతల వారీగా వడివాసల్ నుంచి బయటకు వచ్చాయి. వాటిని అదుపుచేసేందుకు 200 మంది క్రీడాకారులు పోటీపడ్డారు. ఎక్కువ ఎద్దులు అదుపుచేసిన క్రీడాకారులు, క్రీడాకారులకు అందకుండా వెళ్లిన ఎద్దుల యజమానులకు బీరువా, మంచం, కుర్చీలు, వెండి, బంగారు నాణేలు బహుమతులుగా అందజేశారు. ఈ పోటీల్లో సుమారు 40 మంది క్రీడాకారులు గాయపడగా వారికి పోటీలు నిర్వహించిన ప్రాంగణంలోనే వైద్యచికిత్సలు అందించారు. మెరుగైన చికిత్సలకు 15 మందిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ పోటీలు వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాలు సహా జిల్లాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

భక్తిశ్రద్ధలతో సంప్రదాయ వేడుకలు

పెరంబూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా వాళప్పాడి సమీపం అరునూత్తుమలైలో పతాకావిష్కరణ, దీపం వెలగించే సంప్రదాయ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ప్రాంతంలోని ఏడు కొండ గ్రామాల ప్రజలు తరతరాలుగా ఏడాదికి ఒకసారి ఈ వేడుకలు నిర్వహిస్తుంటారు. వేడుకల్లో భాగంగా అంగప్రదక్షణ చేస్తున్న భక్తులను దాటకుటూఊ ఆలయ ఎద్దు వెళ్లే వేడుక చేశారు. ఎంతమంది భక్తులు ప్రదక్షిణలో పాల్గొన్నా, ఆలయ ఎద్దు వారిపై ఎక్కకుండా వారి మధ్యన నడుచుకుంటూ వెళుతోందని, ఇలా చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకమని నిర్వాహకులు తెలిపారు.


భక్తులపై నుంచి వెళుతున్న ఆలయ ఎద్దు

బాలమురుగన్ ఆలయంలో ప్రత్యేక వేడుకలు


బాలమురుగన్ స్వామిని సత్కరిస్తున్న ప్రముఖులు

వేలూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి బాలమురుగన్ ఆలయ పారంపర్య ట్రస్టీ బాలమురుగన్ అడిమై స్వామి ఆత్మజ్ఞానం పొందిన 58వ వార్షిక వేడుకలు శుక్రవారం నిర్వహించారు. తొలుత రత్నగిరి కొండపై ఉన్న వల్లి, దేవయాని సమేత మురుగన్‌కు ప్రత్యేక అభిషేకం, అలంకరణ, దీపారాధన చేశారు. అనంతరం బాలమురుగన్ స్వామి భక్తులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మయిలం బొమ్మైపురం ఆధీనం శివజ్ఞాన బాలయ్య స్వామి, రాణిపేట అన్నాడీఎంకే వెస్ట్ జిల్లా సెక్రటరీ సుకుమార్, కలవై సచ్చిదానంద స్వామి సహా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనగా, ఆలయ నిర్వహణ అధికారి శంకర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యార్థులకు పిచ్చుక గూళ్ల పంపిణీ


పిచ్చుక గూళ్లు అందజేస్తున్న నిర్వాహకులు

పెరంబూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా పలు సంస్థలు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాయి. కన్నియాకుమారి జిల్లా దేవానైలో పలు స్వచ్ఛంధ సంస్థల ఆధర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు పిచ్చుక గూళ్లు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ... పిచ్చుకల దినోత్సవం సందర్భంగా ప్రజలకు పక్షులను రక్షించాలని పిలుపు ఇవ్వడంతో పాటు పాఠశాల, కళాశాల విద్యార్థులకు గూళ్లు అందించి, వాటిని ఇంటి ప్రాంగణం, మిద్దెపైన ఏర్పాటుచేయాలని సూచించామన్నారు.


రాష్ట్రంలో సర్వ శిక్షా అభియాన్ పథకం కొనసాగింపునకు రాష్ట్ర ప్రభుత్వమే నిధులు సమకూర్చేలా బడ్జెట్‌లో ప్రకటించినందుకు సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసి ధన్యవాదాలు తెలుపుతున్న ఆ పథకంలో చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తిరుచ్చిలో రూ.290 కోట్లతో 'కలైంజర్ గ్రంథాలయం, మేధోసంపత్తి కేంద్రం'

- శంకుస్థాపన చేసిన సీఎం

చెన్నై, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి నగరంలో రూ.290 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న 'కలైంజర్ గ్రంథాలయం, మేధోసంపత్తి కేంద్రానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శంకుస్థాపన చేశారు. చెన్నై సచివాలయంలో శుక్రవారం ఉదయం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ భవన సముదాయం భూమిపూజకు శ్రీకారం చుట్టారు. గత యేడాది జూన్ 27న శాసనసభలో చేసిన ప్రకటన మేరకు తిరుచ్చి నగరంలో ఏడంతస్తుల గ్రంథాలయ భవన సముదాయాన్ని రూ.235 కోట్లతో నిర్మించి, రూ.50 కోట్లతో పుస్తకాలు, ఈ-బుక్స్, రూ.5 కోట్లతో సాంకేతికపరికరాలను సమకూర్చనున్నామని స్టాలిన్ తెలిపారు. ఆ భవనంలో ఎస్కలేటర్లు, రెండు అద్దాల లిఫ్టులు, ఏడు సాధారణ లిఫ్టులు, అగ్నిమాపక వ్యవస్థ, ఏసీ సదుపాయాలు ఉంటాయన్నారు. ఆ గ్రంథాలయ ప్రపంచ తమిళ సాహిత్యం, ప్రాచీన తమిళ సాహిత్యం, నవీన సాహిత్యం, వ్యాకరణం, కళలు, కవితలు, నాటక గ్రంథాలు, అనువాద గ్రంథాలు, జాతికి అంకితమైన గ్రంథాలు, పెరియార్, అన్నాదురై, కరుణానిధి రచించిన గ్రంథాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఈవీ వేలు, అన్బిల్ మహేష్, ఎమ్మెల్యే ఇనిగో ఇరుదయరాజ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం, పాఠశాలల విద్యాశాఖ కార్యదర్శి జే జయకాంతన్, రాష్ట్ర పాఠ్యపుస్తకాల సంస్థ మేనేజింగ్ డైరెక్టరన్ ఇప. శంకర్ పాల్గొన్నారు. తిరుచ్చిలో జిల్లా కలెక్టర్ ఎం. ప్రదీప్ ఎకుమార్, కార్పొరేషన్ మేయర్ ఎం.అన్బళగన్ తదితరులు పాల్గొన్నారు.


సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రంథాలయానికి శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

17 వేల ఆలయాల్లో ఏకకాల పూజలకు రూ.110కోట్లు

హిందూ దేవాదాయశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఏకకాల పూజలు జరిగే 17వేల ఆలయాలకుగాను కార్పస్ ఫండ్‌గా రూ.110 కోట్లను అందజేశారు. ఆ సందర్భంగా రూ.100 కోట్ల చెక్కును రాష్ట్ర పవర్‌ఫైనాన్స్ కార్పొరేషన్‌లో డిపాజిట్ చేసేలా ఆ సంస్థ చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ పి. జమీలాకు సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ అందజేశారు. ఏకకాల పూజలు జరుగుతున్న ఆలయాలకు ఈ యేడాది నుండి రూ.2.50 లక్షల ఆర్థికసాయం అందజేయనున్నారు. ఆ మేరకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో డిపాజిట్ చేసిన నగదు ద్వారా వచ్చే వడ్డీ ద్వారా ఏకకాల పూజలు నిర్వహించే పూజలకు ప్రతి నెలా రూ.1000లను అందజేయనున్నారు. ఈ మేరకు సచివాలయంలో 10 ఆలయాలకు చెందిన పూజారులకు ఈ ఆర్థిక సహాయానికి సంబంధించిన ఉత్తర్వులను స్టాలిన్ అందించారు. ఈ కార్యక్రమంలో హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, పర్యాటక దేవాదాయ శాఖల అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే మణివాసగన్, హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ పీఎస్ శ్రీధర్, అడిషనల్ కమిషనర్ డాక్టర్ సి.పళని, డిప్యూటీ కమిషనర్ పి. జయరామన్ తదితరులు పాల్గొన్నారు.


ఏకకాల పూజలు జరిగే ఆలయాలకు డిపాజిట్ సొమ్మును రాష్ట్ర పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారి పి. జమీలాకు సచివాలయంలో అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్


సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న ఐర్లాండ్ ఉన్నతవిద్యాశాఖ మంత్రి జేమ్స్ ఫ్యాట్రిక్ లాలెస్, రాయబారి కేవిన్ కెల్లీ తదితరులు





పవిత్ర రంజాన్ మాసం నమాజు చేసేందుకు మాత్రమే కాదు, ఘుమఘుమలాడే పసందైన వంటకాలకు కూడా రంజాన్ సీజన్ ప్రత్యేకం. రంజాన్ మాసం వచ్చిందంటే చాలు రాజధాని నగరం చెన్నై అంతా సందడిగా మారుతుంది. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటూ ముస్లింలంతా ఆనందంగా గడుపుతారు. ఉపవాస దీక్షల వేళ ఆహారం విషయంలో ప్రత్యేకశ్రద్ధ చూపుతారు. రంజాన్ పండుగరోజు ప్రతి ముస్లిం కుటుంబంలో ఘుమఘుమలాడే షీర్ కుర్మా గుబాళిస్తుంటుంది. పాలు, నెయ్యి, జీడిపప్పు, బాదం, కిస్మిస్, యాలకుల మిశ్రమంతో తయారుచేసే సేమియా పాయసం అంటే అందరికీ నోరూరుతుంది. ఈ సేమియా తయారీ చూడటానికి చాలా అద్భుతంగా వుంటుంది. రంజాన్ మాసం ప్రారభానికి మూడునెలల ముందు నుండే తిరువొత్తియూరు కాలడిపేటలో వున్న సుమారు పదికిపైగా ముస్లిం కుటుంబాలు సేమియా తయారు చేయడం ప్రారంభిస్తారు. మైదాపిండిలో ఉప్పువేసి ఒకరోజంతా నానబెట్టి మరుసటిరోజు చిన్నచిన్న ముద్దలుగా చేసి గాల్లోకి ఎగురవేసి సాగదీసి, తీగలుగా చేసి ఎండబెడుతుంటారు. అలా రోజుకు 30 నుండి 40 కిలోల వరకు తయారుచేసే సేమ్యాను ప్యాకింగ్ చేసి పండుగ సమయానికి షాపులకు సరఫరా చేస్తుంటారు. ఈ సేమ్యా తయారీ చూడడానికి చాలా అద్భుతంగా వుంటున్నప్పటికీ దీనిని తయారు చేసేందుకు వారు ఎదుర్కొంటున్న కష్టాలు అంతింతా కాదు. ఎండ కాస్తేనే తమకు జీవనోపాధి అని ఆ కుటుంబాలు వాపోయాయి. కాగా, రంజాన్ ప్రత్యేక వంటకాల్లో ఉపయోగించే మేలు రకమైన బియ్యం, మసాలా దినుసులు, నూనె తదితరాలు విక్రయించే షాపుల్లో అమ్మకాలు కూడా మొదలయ్యాయి.

- ప్యారీస్, ఆంధ్రజ్యోతి


సేమియా తయారు చేసి ఎండ పెట్టిన దృశ్యం

ఇది అభిమానుల సినిమా, కానీ....

- చియాన్ విక్రమ్

తాను నటించిన తాజా చిత్రం 'వీర ధీర శూరన్-2' అభిమానుల సినిమా అని కానీ, ఇందులో ఎమోషన్స్‌తో పాటు 'సేతు', 'సిత్రా' లోని అనేక అంశాలున్నాయని హీరో చియాన్ విక్రమ్ అన్నారు. హెచ్.ఆర్.పిక్చర్స్ పతాకంపై రియా షిబు నిర్మాణంలో ఎస్.యు.అరుణ్ కుమార్ దర్శకత్వం వహించారు. చియాన్ విక్రమ్‌తో పాటు ఎస్‌జే సూర్య, దుషార విజయన్, సూరజ్ వెంజరమూడు తదితరులు నటించారు. ఈ నెల 27న చిత్రం విడుదలకానున్న నేపథ్యంలో గురువారం రాత్రి ఆడియో, ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. విక్రమ్ మాట్లాడుతూ, 'ఎస్‌జే సూర్య ఒక రాక్‌స్టార్. విశ్రాంతి లేకుండా పనిచేస్తాడు. ఈ సినిమా కోసం ఎంతగానో శ్రమించాం. రియా షిబు ఓ మంచి నిర్మాత. భవిష్యత్‌లో ఆయన తండ్రికి మించిన నిర్మాత అవుతారు. జీవీ ప్రకాష్ అదృష్టవంతుడు. మేమిద్దరం కలిసి పనిచేసిన పాటలన్నీ హిట్. జీవీతో కలిసి పనిచేసిన ప్రతి సినిమాకు ఒక భిన్నమైన కథ ఉంటుంది.దుషార విజయన్ కలైవాణి అనే పాత్రలో నటించారు. ఒక ఫైట్ సన్నివేశంలో ఫైట్ ఆర్టిస్ట్ నటించేందుకు భయపడినప్పటికీ దుషార మాత్రం వెనుకంజ వేయలేదు. ప్రతి ఒక్కరూ చూసి ఎంజాయ్ చేయండి' అన్నారు. దర్శకుడు ఎస్.యు.అరుణ్ కుమార్ మాట్లాడుతూ, 'ఒక సినిమా కోసం విక్రమ్ పడే తపన మాటల్లో వర్ణించలేం. 62 చిత్రాల్లో నటించినప్పటికీ తదుపరి సన్నివేశంలో ఎలా నటించాలో ఒక రోజు ముందుగానే అడిగి తెలుసుకుంటారు. నేను ఎస్‌జే సూర్య వీరాభిమానిని. నాపై నమ్మకంతో ఈ సినిమా కోసం పనిచేసినందుకు ధన్యవాదాలు' అన్నారు. ఎస్‌జే సూర్య మాట్లాడుతూ, 'వైవిధ్యభరితమైన కథతో తీసిన సినిమా. 'పితామగన్', 'సేతు' సినిమాల తరహాలో ఉంటుంది. జీవీ ప్రకాష్ చెప్పినట్టుగా 'అసురన్' వంటి చిత్రాలకు మంచి ఆదరణ లభిస్తుంది. ఈ సినిమా టిపికల్ మూవీ. హాలీవుడ్ మూవీని తమిళ నేపథ్యంలో తీసిన చిత్రం. ఈ సినిమాలో కొత్త ఎస్‌జే సూర్యను చూస్తారు' అని పేర్కొన్నారు. ఆ తర్వాత హీరోయిన్ దుషార విజయన్, నిర్మాత రియా షిబు, సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ తదితరులు ప్రసంగించారు.


ఆడియో రిలీజ్ వేడుకలో విక్రమ్ - సూర్య

తమిళ చిత్రజ్యోతి

'సూర్య-45' చిత్రంలో త్రిష



సూర్య - త్రిష జంటగా 'సూర్య-45' వర్కింగ్ టైటిల్ ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమాలోని ఓ పాటను 500 మందికిపైగా డ్యాన్సర్లు, కళాకారులతో చిత్రీకరించేలా ప్లాన్ చేశారు. ఇందుకోసం భారీ సెట్ వేస్తున్నారు. ఈ సెట్ నిర్మాణం పూర్తికాగానే ఈ పాటను చిత్రీకరించాలని దర్శక నిర్మాతలు ప్లాన్ చేశారు. ఇటీవలి కాలంలో సూర్య నటించిన చిత్రాల్లో ఈ తరహా పాటలు ఎక్కడా కనిపించవు. అయితే, సూర్య-45లో మాత్రం సూర్య అభిమానులను అలరించేలా శోభి మాస్టర్ నృత్య దర్శకత్వంలో ఈ పాట చిత్రీకరించనున్నారు. కాగా, డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రానికి ఆర్‌జే బాలాజీ దర్శకుడు. ఇందులో సూర్య, త్రిషతో పాటు ఇంద్రన్స్, శ్వాసిక, అనకా మాయా రవి తదితరులు కీలక పాత్రలను పోషిస్తున్నారు.

రవి అరసు దర్శకత్వంలో విశాల్!


విశాల్ - రవి అరసు

రవి అరసు దర్శకత్వంలో విశాల్ హీరోగా ఓ సినిమా రానున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఇటీవల 'మదగదరాజా' చిత్రంతో బ్లాక్ బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్న విశాల్.. తన తదుపరి చిత్రం కోసం అనేక మంది దర్శకుల కథలు వింటున్నారు. ఈ క్రమంలో సందర్ చెప్పిన కథ నచ్చడంతో అందులో నటించేందుకు అంగీకరించారు. కానీ, ఈ సినిమా బడ్జెట్ భారీగా పెరిగిపోవడంతో ఈ ప్రాజెక్టును విరమించుకున్నారు. ఇపుడు డైరెక్టర్ రవి అరసు చెప్పిన కథను ఓకే చేశారు. అయితే, ఇందులో నటీనటులు, నిర్మాణ సంస్థ తదితర వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. మరోవైపు, రవి అరసు గతంలో 'ఈట్టి', 'ఐంగారన్' అనే చిత్రాలను రూపొందించారు. అలాగే, శివరాజ్‌కుమార్ హీరోగా ఓ కొత్త చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ముగిసిన తర్వాతే విశాల్ - రవి అరసు సినిమా పట్టాలెక్కే అవకాశం ఉంది.



నటనకు భాష అడ్డంకి కాదు

- సీమా బిశ్వాస్

నటనకు భాష ఒక అడ్డంకి కాదని అనుభవపూర్వకంగా తెలిసిందని సీనియర్ నటి సీమా బిశ్వాస్ అభిప్రాయపడ్డారు. 'ఓం కాళి - జై కాళి' వెబ్ సిరీస్‌లో ఆమె నెగిటివ్ షేడ్స్ ఉండే ప్రతినాయకి పాత్ర పోషించారు. ఈ నెల 28వ తేదీ నుంచి జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్‌కానుంది. ఈ వెబ్ సిరీస్ ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ, 'ఈ వెబ్ సిరీస్ కథలో పురాణాలు, ఆచారాలను చాలా ఆసక్తికరంగా ఉన్నాయి. నేను విలన్‌గా నటించాను. నా పాత్రలో పాజిటివ్, నెగెటివ్ షేడ్స్ చాలానే కనిపిస్తాయి. కథ విన్న వెంటనే అంగీకరించాను. దర్శకుడు రాము చెల్లప్ప చాలా అంకితభావం కలిగిన టెక్నీషియన్. ఒక ట్రాన్స్‌లేటర్ ద్వారా కథ వినిపించారు. సెట్‌లో భాష అడ్డం అవుతుందేమో అని భయపడ్డాను. కానీ, దర్శకుడు రాము చెల్లప్ప షూటింగ్ సమయంలో ఎంతగానో సహకరించారు' అన్నారు.కాగా, 'బండిట్ క్వీన్', 'కామోషి' వంటి అనేక చిత్రాల్లో తన నటనా విశ్వరూపాన్ని ప్రదర్శించిన సీమా బిశ్వాస్... 2003లో వచ్చిన 'ఇయర్కై' అనే తమిళ చిత్రంలోనూ నటించి కోలీవుడ్ ప్రేక్షకులకు దగ్గరయ్యారు. 2006లో వచ్చిన 'తలైమగన్' మూవీలోనూ ఆమె నటించారు. ఇపుడు ఈ వెబ్‌సిరీస్ ద్వారా తమిళ ప్రేక్షకులను పలుకరించేందుకు ముందుకు వస్తున్నారు.



ఎగ్మూరులోని రాజరత్తినం స్టేడియంలో శుక్రవారం జరిగిన 'ఆలిండియా పోలీస్ షూటింగ్ పోటీల' ముగింపోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పతకాలను అందిస్తున్న ఉపముఖ్యమంత్రి ఉదయనిధి . చిత్రంలో డీజీపీ శంకర్ జివాల్ తదితరులున్నారు.



సర్వ దర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 18కంపార్టుమెంట్లలో సర్వ దర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.71 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,872

తలనీలాలు సమర్పించినవారు: 23,523



ఎగ్మూరు సిరాజ్‌మహల్‌లో శుక్రవారం రాత్రి అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటైన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి

ఒకే రోజు 12 మందికి జీవిత ఖైదు

● సంచలన తీర్పునిచ్చిన అరియలూరు కోర్టు

అడయార్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అరియలూరు జిల్లాలో జరిగిన ఒక హత్య కేసులో ఒకే రోజు 12 మందిని దోషులుగా ప్రకటించిన జిల్లా కోర్టు వారందరికీ జీవిత కారాగారశిక్షలను ఖరారు చేసింది. ఈ జిల్లాలకు చెందిన కందస్వామి (60) కుమారుడు కలైమణి (25)కు, అదే ప్రాంతానికి చెందిన రవిచంద్రన్ (56) అనే వ్యక్తికి మధ్య మురుగునీటి కాలువ వివాదం ఉంది. ఈ క్రమంలో రవిచంద్రన్ తన కుమారుడు అరవిందన్ (32), సోదరుడి భార్య వళర్మతి (50), ఆమె కుమారులు అఖిలన్ (26), కపిలన్ (25), పవిత్రన్ (23), రచిచంద్రన్ సోదరి కళ (45), ఈమె భర్త గురుస్వామి (52) కలిసి కలైమణిపై దాడి చేశారు. దీన్ని గమనించిన కందస్వామి తన కుమారుడిని ఇంటిలో ఉంచి తాళం వేశాడు. దీంతో రవిచంద్రన్, వారి బంధువులు కందస్వామిపై దాడి చేయడంతో ఆయన ఘటనా స్థలంలోనే మరణించాడు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేయగా, అరియలూరు జిల్లా కోర్టు విచారణ జరిపింది. ఈ కేసులో పోలీసులు సమర్పించిన ఆధారాలను పరిశీలించిన కోర్టు.. మొత్తం 12 మందికి యావజ్జీవ కారాగారశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. ఈ తీర్పును వినగానే ముద్దాయిల్లో ఒకరైన కలై అనే వ్యక్తి కోర్టు ప్రాంగణంలోనే ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. దోషులందరినీ తిరుచ్చి సెంట్రల్ జైలుకు తరలించారు.

కారైక్కుడిలో రౌడీ హత్య

● నిందితుల కోసం పోలీసుల గాలింపు

చెన్నై, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా కారైక్కుడి సమీపంలో రౌడీ మనోను కారులో వచ్చిన ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తులు వేటకొడవళ్ళు, కత్తులతో దాడిచేసి దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటనలో అతడి స్నేహితులు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సేరావుర్ని ప్రాంతానికి చెందిన మనోపై పలు పోలీసుస్టేషన్లలో హత్య, హత్యాయత్నం, దారిదోపిడీ కేసులున్నాయి. ఇటీవల ఓ కేసులో అరెస్టయి కొద్దిరోజుల క్రితం బెయిలుపై బయటకు వచ్చాడు. బెయిలు నిబంధనల ప్రకారం కారైక్కుడు నార్త్ పోలీస్‌స్టేషన్‌లో ప్రతిరోజూ ఉదయం సంతకం చేస్తున్నాడు.



మనో (ఫైల్‌ఫొటో)

ఆ మేరకు శుక్రవారం ఉదయం పోలీసుస్టేషన్‌లో సంతకం చేసిన మనో తన ఇద్దరు స్నేహితులతో కలిసి బైకులో తిరిగి వెళ్తుండగా కారైక్కుడి వందడుగుల రోడ్డులో కారులో వచ్చిన ఆరుగురు కత్తులు, వేటకొడవళ్లతో దాడికి పాల్పడ్డారు.. ఈ దాడిలో మనో అక్కడికక్కడే మరణించగా, అతడి స్నేహితులిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మనో మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసుకుని హంతకుల ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

అన్నం వడ్డించి.. ఆప్యాయంగా పలకరించి..

దేవాన్ష్ పుట్టినరోజు సందడి

నుదుట తిరునామం.. తళతళ మెరిసే సరిగ పంచె, లాల్చీ.. మెడలో పట్టు కండువా.. సంప్రదాయ వస్త్రధారణతో తాతా మనవళ్లు ఇద్దరూ శుక్రవారం తిరుమలో సందడి చేశారు. చిరునవ్వులతో భక్తులకు అన్నం వడ్డించారు. నారా దేవాన్ష్ 11వ పుట్టినరోజున ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు కుటుంబం, అనంతరం వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భోజనాలు వడ్డించారు. దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా ఒక్కరోజు అన్నప్రసాద వితరణకు అయ్యే రూ.44 లక్షల విరాళాన్ని టీటీడీకి అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి.



స్వామి వారి దర్శనానంతరం రంగనాయక మండపం వద్ద కుటుంబ సభ్యులతో సీఎం

సీఎం చంద్రబాబుతో పాటూ ఆయన సతీమణి భువనేశ్వరి, కుమారుడు, మంత్రి లోకేశ్, కోడలు బ్రాహ్మణి, దేవాన్ష్ ఉదయం 8.30గంటలకు శ్రీవారి ఆలయంలోకి ప్రవేశించారు. సీఎం హోదాలో మహద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లే అవకాశమున్నప్పటికీ చంద్రబాబు ఎప్పటిలానే వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారానే దర్శనానికి వెళ్లారు. ఉదయం 8.28 గంటలకు మహద్వారం వద్దకు చేరుకున్న సీఎంకు టీటీడీ అధికారులు, అర్చకులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. దర్శనం తర్వాత రంగనాయక మండపంలో వేదాశీర్వచనం అందుకుని 9.19 గంటలకు ఆలయం వెలుపలకు వచ్చారు. దాదాపు 40 నిమిషాల పాటు సీఎం కుటుంబం ఆలయంలో గడిపింది. అంతకు అరగంట ముందే ఏర్పాట్ల పర్యవేక్షణకు టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆలయంలోకి వెళ్లారు. సీఎం రాకకు ముందే టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కూడా ఆలయంలోకి వెళ్లారు. సీఎం కుటుంబం ఆలయంలోకి వెళ్లిన తర్వాత ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మనవడితో కలిసి వడ్డన చేస్తున్న సీఎం చంద్రబాబు

ఇందిర సృష్టించిన కళాత్మక పెయింటింగ్స్



ఆరుపదుల వయసులోనూ

అలుపెరుగని కళాకారిణి



ధనలక్ష్మి పెయింటింగ్‌తో ఇందిర

తరుణి

తంజావూరు బాణీ పెయింటింగ్స్‌తో రాణిస్తున్న

చెన్నైకి చెందిన ఇందిర

టి.నగర్, ఆంధ్రజ్యోతి

ఆ ఇంటి గదిలో చుట్టూ దేవతామూర్తుల చిత్రపటాలు. ఇవిగాక పక్షులు, ప్రకృతి సౌందర్యం మరింత ఆనందాన్ని కలిగిస్తాయి. ఇలా వివిధ రకాల తంజావూరు బాణీ చిత్రలేఖనాలు ఆ ఇల్లంతా నిండి ఉంటున్నాయి. వాటి మధ్యలో కూర్చుని తంజావూరు బాణీ పెయింట్ చేస్తోంది అపూర్వ చిత్రకళాకారిణి ఇందిర. ఓ వైపు గృహిణిగా ఇంటి బాధ్యతలన్నింటినీ నిర్వర్తిస్తూనే మూడు దశబ్దాలుగా తంజావూరు పెయింటింగ్ తన ప్రాణసమానంగా భావించి ఆ రంగంలోనే ఆరితేరారు 69 ఏళ్ల ఇందిర. ఈ వయస్సులో సోమరితనం దరిచేరనీయకుండా చాలా చురుకుగా తంజావూరు పెయింటింగ్ వేయడం చూస్తుంటే అందరికీ ఆశ్చర్యమేస్తుంది. ఆ కళను నేర్చుకున్న తీరు తదితర వివరాలను ఆమె తరుణితో ముచ్చటించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

'నా సొంతూరు నాగపట్టినం. చదివింది, పెరిగింది ఈరోడ్‌లోనే. నాకు ఓ సోదరి, ముగ్గురు సోదరులున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఎస్‌ఎస్‌ఎల్‌సీ వరకే చదివాను. ఆ తర్వాత ఓ యేడాది పీయూసీకి వెళ్ళాను. ఆపై చదువులకు స్వస్తి చెప్పి ఇంటి పనులకే పరిమితమయ్యాను. ఆ సమయంలో మా చిన్నాన్న తంజావూరు పెయింటింగ్స్ వేస్తుండేవారు. ఆయన రూపొందించిన పెయింటింగ్స్ నన్నెంతగానో ఆకట్టుకున్నాయి. అప్పటి నుండి తంజావూరు పెయింటింగ్ నేర్చుకోవాలనే ఆసక్తి అధికమైంది. ఆ పెయింటింగ్ నేర్పమంటూ ఆయన్నే అడిగాను. తంజావూరు పెయింటింగ్ అద్భుతమైన కళ ఆ కళ నేర్చుకోవడం అంత సులువు కాదని ఆయన నన్ను నిరుత్సాహపరిచారు. దాంతో నాలో పట్టుదల అధికమైంది. ఆ తర్వాతే ఇంటిలో బొమ్మలు గీయటం ప్రారంభించాను. ప్రత్యేకించి దేవతా మూర్తుల బొమ్మలు గీయసాగాను. ఇలా రోజులు గడిచాయి. 32 యేళ్ల ప్రాయంలో వివాహమైంది. ఆ సమయంలో నా భర్త శివబాలన్ ఈరోడ్‌లో ప్రభుత్వ ఉద్యోగంలో ఉండేవారు. ఆయనకు ఉన్నట్టుండి చెన్నై సచివాలయానికి బదిలీ అయ్యింది. దీంతో చెన్నై నగరమే మా స్థిర నివాసంగా మారింది. తంజావూరు పెయింటింగ్‌లో రాణించడానికి తన భర్త అందించిన సహాయ సహకారాలు ఎన్నటికీ మరచిపోలేనని ఆమె చెప్పారు. చెన్నై వచ్చిన తొలి నాళ్లలో ఇంటి నాలుగుగోడల మధ్యనే గడపటం బోర్‌కొట్టింది. ఆ సమయంలో ఇంటిలో ఉంటూ పోస్టల్ ద్వారా డిగ్రీ చేయమని ప్రోత్సాహించారు. ఆ ప్రకారమే చదివి డిగ్రీ తీసుకున్నాను. ఆ తర్వాత తంజావూరు పెయింటింగ్ నేర్చుకోవాలని ఆశగా ఉందని చెప్పాను. నా ఇంట్రెస్టను గమనించి ఆయన కళాక్షేత్రలో పనిచేస్తున్న లక్ష్మీ కృష్ణమూర్తి దగ్గర తంజావూరు పెయింటింగ్ నేర్చుకోమన్నారు. మూడేళ్లపాటు ఆమె వద్ద శిక్షణ పొంది సర్టిఫికెట్ కూడా పొందాను. ఆ తర్వాత జాతీయ అవార్డు గ్రహీత ఈశ్వర్ లాల్ సార్ వద్ద 'గ్లాస్ పెయింటింగ్' నేర్చుకున్నాను. ఆ సమయంలోనే అమ్మాయి పుట్టింది. ఆ తరువాత తంజావూరు పెయింటింగ్ పనులు ముమ్మరంగా ప్రారంభించాను.



భర్త శివబాలన్‌తో

తంజావూరు సొసైటీకి తొలి కానుక...

నా తొలి పెయింటింగ్ తంజావూరు సొసైటీకి కానుకగా ఇచ్చాను. ఆ తర్వాత మరికొన్ని పెయింటింగ్స్ స్నేహితులకు ఇచ్చాను. వాటిని చూసి అందరూ తంజావూరు పెయింటింగ్స్‌తో బిజినెస్ చేయమంటూ ప్రోత్సహించారు. ఆ తర్వాత జిల్లా పారిశ్రామిక కేంద్రం నుండి రుణం పొంది తంజావూరు పెయింటింగ్ బిజినెస్‌కు శ్రీకారం చుట్టాను. తంజావూరు సొసైటీకి, ఆ తర్వాత చెన్నైలోని పూంపుహార్ షోరూమ్‌కు తంజావూరు పెయింటింగ్‌లు సరఫరా చేశాను. నా వర్క్ నచ్చటంతో మరింతగా ఆర్డర్లు వచ్చేవి. అంతేకాకుండా ఢిల్లీలోని పూంపుహార్ షోరూమ్‌కు కూడా తంజావూరు పెయింటింగ్‌లను సరఫరా చేయమన్నారు. ఆ విధంగా అందమైన తంజావూరు పెయింటింగ్‌లు సరఫరా చేశాను. మరికొన్ని షోరూమ్‌లలోనూ నా తంజావూరు పెయింటింగ్స్‌కు డిమాండ్ అధికమైంది. పూంపుహార్ సంస్థ నాకు అన్ని వేళలా అండగా నిలుస్తోంది.

విదేశీయుల ప్రశంస...

అదే సమయంలో విదేశాల్లో ఉన్న అడయార్‌కు చెందిన ఓ యువతి నా వద్ద గురువాయూరు కృష్ణుడి పెయింటింగ్స్ రెండింటిని కొనుగోలు చేసి తీసుకెళ్లింది. ఆ పెయింటిగ్స్ చూసి విదేశీయులు సైతం మెచ్చుకున్నట్లు ఆమె ఫోన్ చేసి తెలుపటంతో ఎంతో సంతోషం కలిగింది. ఆ తరువాత టి.నగర్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి ఆలయానికి కూడా తంజావూరు పెయింటింగ్స్ భారీ స్థాయిలో సరఫరా చేశారు. పుదుచ్చేరిలోని ఓ సిల్కు హౌస్ నిర్వాహకులు వారి ఉద్యోగులకు దసరా కానుకగా ఇచ్చేందుకు తంజావూరు పెయింటింగ్స్ కావాలని అడిగారు. వారికి కూడా పెయింటింగ్స్ సరఫరా చేశాను. నగరంలో వళ్లువర్‌కోట్టమ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీల్లోనూ నా పెయింటింగ్స్‌కు మంచి పేరొచ్చింది. అదే విధంగా నేను రూపొందించిన రాధాకృష్ణుల పెయింటింగ్‌కు జిల్లా స్థాయి అవార్డుకు కూడా ఎంపికైంది. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి అవార్డుల కోసం దరఖాస్తు పెట్టుకున్నాను. నా భర్త రిటైర్ అయ్యాక తంజావూరు పెయింటింగ్స్‌ను ప్రొఫెషనల్‌గా చేయనారంభించాం. మొదట మాధవరంలో నివసించేవాళ్లం. అమ్మాయి పెళ్ళి చేసిన తర్వాత పమ్మల్ ప్రాంతానికి మకాం మార్చేశాం. నా భర్త నాకు సాయపడుతూ అండగా నిలిచారు. ప్రస్తుతం ఆయనకు 72 యేళ్లు. నాకేమో 69 యేళ్లు. ఈ కారణంగానే గతంలా భారీ బిజినెస్ చేయడం లేదు. చెన్నై, తంజావూరు షోరూమ్‌లకు మాత్రమే పెయింటింగ్స్ సరఫరా చేస్తున్నాం. ఇది కాకుండా గ్లాస్ పెయింటింగ్ వర్క్‌కు కూడా చాలా ఆర్డర్లు వస్తున్నాయి. వాటిని కూడా చాలా శ్రమించి శ్రద్ధగా తయారు చేసి అందిస్తున్నాను. ఇక కోట్లకు పడగెత్తాలని ఈ పెయింటింగ్స్ అమ్మటం లేదు. దేవతా మూర్తుల రూపాలతో తంజావూరు బాణీ పెయింటింగ్స్ వేయడం ఆధ్యాత్మికపరంగా ఎంతో ఆత్మసంతృప్తి కలిగిస్తోంది. అందుకనే ఈ కళ నేర్చుకోమని భావితరాలకు ఇందిర విజ్ఞప్తి చేశారు.

తిరువాన్మియూర్ బీచ్‌లో

దివ్యాంగుల కోసం ప్రత్యేక మార్గం



చెన్నై మెరీనా బీచ్‌లో ఏర్పాటు చేసిన కలప మార్గం

వాషర్‌మెన్ పేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తిరువాన్మియూర్ బీచ్‌లో దివ్యాంగుల కోసం కలపతో రూపొందించే ప్రత్యేక మార్గం సిద్ధం కానుంది. ఇసుకపై నడవడానికి ఇబ్బందిపడే దివ్యాంగులు సముద్రం వరకు సులభంగా చేరుకులేనా దీనిని నిర్మిస్తున్నట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు తెలిపారు. దీనికోసం రూ. 1.2 కోట్లు వెచ్చించనున్నట్లు వారు పేర్కొన్నారు. కలపతో రూపొందనున్న 'ర్యాంప్' మార్గం అటు దివ్యాంగులకే కాకుండా వృద్ధులు, చిన్న పిల్లలకు కూడా ఉపయోగకరంగా ఉం టుంది. ఈ నడక మార్గం సముద్ర ముఖద్వారం నుండి తీరం వరకు ఇసుకపై సుమారు వంద మీటర్ల పొడవున నిర్మించనున్నారు. మార్గం వెంబడి వెళ తున్నప్పుడు అలసట అనిపిస్తే సేదతీరడానికి ప్రత్యేక స్థలం కూడా ఏర్పాటు కానున్నాయి. అంధుల కోసం స్పర్శతో గ్రహించడానికి వీలుగా మార్గాన్ని నిర్మించనున్నారు.

ఇదే రకమైన నడకమార్గాలు మెరీనా బీచ్, బెసెంట్ నగర్‌లోని ఎలియట్స్ బీచ్‌లోను ఇదివరకే నిర్మించారు. వాటిని వినియోగిస్తున్న ప్రజల నుండి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా తిరువాన్మియూర్‌లో నిర్మించనున్న మార్గాన్ని కూడా దీర్ఘ కాలం మన్నేలా నాణ్యతతో నిర్మించనున్నట్టు తెలిపారు. భారీ అలల తాకిడి తట్టుకునే విధంగా, ఉప్పు నీటి కోత వలన తుప్పు పట్టకుండా ఉండేలా జాగ్రత్తలు చేపట్టనున్నట్టు అధికారులు వివరించారు. తడి కాళ్లతో నడిచినా జారకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పర్యావరణ శాఖ నుంచి అనుమతి వచ్చిన వెంటనే ఆరు నెలల వ్యవధిలో నిర్మాణం పూర్తి చేయాలనే ప్రణాళిక సిద్ధం చేసినట్టు అధికారులు స్పష్టం చేశారు. ఇది పూర్తయితే చెన్నై సముద్ర తీరంలోని మూడు ప్రాంతాలు దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కలప 'ర్యాంప్'లతో అలరారుతాయి.

ఆర్ అండ్ డీ కేంద్రం బలోపేతం

● కోబెల్కో కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్ణయం



మీడియా సమావేశంలో టేకేమిచి హిరాకావా తదితరులు

అడయార్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జపాన్‌కు చెందిన కొబెల్కో కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ కంపెనీ భారత్‌లో నెలకొల్పిన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) సెంటర్‌ను మరింతగా బలోపేతం చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఈ కంపెనీకి ఆర్ అండ్ డీ కేంద్రం ఏపీలోని తిరుపతి జిల్లా శ్రీసిటీలో ఉంది. దీనిని మరింతగా బలోపేతం చేయాలని నిర్ణయించింది. అదే సమయంలో ఈ కంపెనీ 20 వేల ఎక్స్‌కవేటర్ల తయారీ మైలురాయిని అధికగమించింది. శ్రీసిటీ ప్లాంట్‌లో ఈ రికార్డును చేరుకుంది. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ సేవలకనుగుణంగా ఈ ప్లాంట్ నెలకొల్పినట్టు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో టేకేమిచి హిరాకావా వెల్లడించారు. ఇదే అంశంపై ఆయన మాట్లాడుతూ.. 20 వేల ఎక్స్‌కవేటర్ ఉత్పత్తి మైలురాయి చేరుకోడం, అధిక నాణ్యనా పరికరాలను అందించడంలో మా నిబద్ధత ప్రతిబింబిస్తుందన్నారు.